# కథ

## ౧

'ఊహుఁ, నేను రానంటూంటే ఎమిటి ఊరికేను ? నీవు వెళ్లరాదూ, నన్ను బ్రతిమాలకపోతేను ?'

'రావూ ?'

'ఊహుఁ'

'ఎప్పుడూ కూర్చుంటే ఏం తోస్తుంది. . రా పోదాం'

'నేను—రాను'

'నామాట వినవూ ?'

'నామాట నీవు వినరాదేం ? మహా . . నేర్చుకుంటూ న్నావులే'

'పోనీలే అమ్మ! నేనూ మానేస్తాను. ఎంతో సరదాగా పిలుస్తూంటే, నాముచ్చట తీర్చడానికైనా రావచ్చునే'

'నేను రానే. . ఏమిటి ... ఓ ... సొద నేను లేకపోతే కోవిలకూయదా, పూలు పూయవా, వెన్నెల కాయదా ? నే నెందుకూ ? నీవే పోయి అనుభవించరాదూ, ఆవైభవమం తాను'

'వల్లకాదు...'

'పోనీ.. మానేయి, ప్రతిపనికి నాతో వంతేనా ఏమిటి?'

శాంతకు కోపం వచ్చి, ఇక అక్కడ నిలువకుండా, వెళ్ళిపోయింది. వనం — వనలత — ఆమె వెళ్ళిపోవడం చూసికూడా మాటాడకుండా ఊరుకుంది.

'ఎందుకూ పనికిరాకుండా .. ఎవరికీకాకుండా .. ఈలా ఆయిపోతున్నానేం ?'

కనుకొలుకుల్లో ఒకటిరెండు ముత్యాలు కనిపించినవి వనానికి. పైట చెరగుతో తుడుచుకోవలెనని యత్నించి మరల మానుకున్నది. ఒకటి .. రెండు .. ఇక బాష్పధార .. ఆవేశాన్ని ఆపుకో లేక పోతున్నది ..

'ఎందుకు .. ఈ .. లా బ్రతకడం. . ఏమున్నదని .. ?

'అక్కయ్యా ! .. వనం ! .. ఇదిగో నిన్నే ..'

— ప్రభావతి నవ్వుతూ పరుగెత్తుకుంటూ వచ్చింది ..

'మహే .. రమేశమే .. అన్నీ బడాయిమాటలేనే ! .. రెండుగేములు గెలిచాను .. పట్టినాయనమ్మ ! నాతోనే ఓడిపోయినాడు'

చిన్ని చెల్లెలిమాటలకి, ఆ విచారంలోనే, వనానికి నవ్వువచ్చింది.

'అలాగేం ! . .' అన్నది, ప్రసన్న భావం అభినయిస్తూ.

'మళ్ళా ఆడమన్నా! ఎప్పటికైనా సైఁ గెలవలేని కుక్క-గయ్యాళికుక్క . . పారిపోయి, అమ్మదగ్గర దాక్కున్నాడు. రమ్మను . . చేతనైతే'

... ... ... ...

'అబ్బ ! నేనురావాలా ఏం . . అక్కడ ఎవరులేరూ . .'

'ఎవరున్నారమ్మ, నాన్నగారు షికారు వెళ్ళారు, రజాక్ కారు తీసుకెళ్ళాడు. ప్రకాశం స్టేషనుకు వెళ్ళాడు, మరి తాతయ్యగారిని రమ్మననా ? ఆయన లేవనే లేడాయెను . .'

'ఎందుకూ అంతచదువు ? వస్తానులే . .'

ప్రభ ముందుదారి తీసింది. వనలత నెమ్మదిగా ఆపిల్ల వెనుక అడుగులు వేస్తూన్నది.

'అదిగో చూడు—ఆ కొమ్మను . . ఊహుఁ . . అది కాదే . . నీలాంబరిమీదుగా . . ఆ . .' . . అదే . . నీవు కోస్తూండు. .నేను గులాబీలు తీసుకువస్తాను. .కోసి. .ఫౌంటెను దగ్గర పెట్టివచ్చాను కాని. . అన్నీ కోయి. .నాకే . . శాంతము చూపించమాక . .'

ప్రభావతి పరుగెత్తుకుని పోయింది. వనం ఆ కొమ్మను బాగావంచి, బాగావికసించిన ఓపూవుకోసి, రేకలు త్రుంచివేస్తూ, తలవంచుకుని అక్కడనే నిలువబడి పోయింది.

'వనం ! . .'

ఉలికిపడి చూసింది. కాంతం, ఆమెనే చూస్తూ, చాలా దగ్గరగా నిలుచుని ఉన్నాడు. ఎప్పుడు . . ఏ మూలనుంచి వచ్చాడో . .

'ఎంతకాలం . . వనం'

ఆమె ఏమీ మాటడలేదు. మళ్ళా తలవంచుకున్నది. కాంతం ఆమెచెయి పట్టుకున్నాడు : ఆతని చేతిమీద కన్నీటి చుక్కలు రాలినవి . .

'ఎందుకూ . . తలఎత్తి . . ఈలా చూడు, వనం !'

వనలత వెక్కి వెక్కి ఏడ్వ మొదలు పెట్టింది . . కాంతం ఆమెను సమాశ్వాసించాలనే యత్నంతో . .

'ఊరుకోవూ . . !' అన్నాడు చాల నెమ్మదిగా . .

'నామాట వినవూ . . ఎందుకూ . . ఊరుకోవూ'

వనం వంచినతల ఎత్తలేదు. కాంతం ఎన్నోవిధాల ఆమెను బ్రతిమాలాడు. ఆమె మారుపలుకనయినా లేదు . .

'వనం !..'

ఆపలేని ఆవేశంతో, కాంతం ఆ అమ్మాయిని కౌగిలించుకోవలెనని ప్రయత్నించాడు . . కాని ఆతని బాహువల్లరిలో

నిక్కకుండా తప్పించుకొని . . తేలకన్నులతో ఆతన్ని చూస్తూ గాలిగా . . వద్దని తల ఊగించింది. కాని, కాంతం చూసీకూడా మాడనివాడిలాగా. .ఆ మెను. .కౌగలించుకుని. . పెదవి ముద్దిడు కున్నాడు. మళ్లా. . మళ్లా . .

ప్రభావతి పరుగెత్తుకుంటూ వచ్చింది. ఆతన్ని తప్పించు కోలేక. . ఆతిని కౌగిలిలోనే ఉన్నది, వనలత . .

. .ప్రభావతి నవ్వుకుంటూ. . ఒక్క పరుగుతీసింది.

౨

'నిన్నుజూచి. . ధన్యుడైతినీ. . నీరజనేత్ర. .'

పాడుతున్నది. ఉదయం, విచారమంతా ఆ కొంచెం సే పయినా మరచిపోవచ్చునుకదా అని. . పాడుదామని ప్రయత్ని స్తున్నది; కాని సాగడంలేదు. వ్రేళ్ళు ఆడటమే లేదు. చివరకు, ఏనువుకుంటూ పాటచాలించి, వీణెను సోఫాకు ఓరగా ఆన్చి, తాను అలా ఓప్రక్కకు ఒరిగింది, వనం.

- చీకటిపడింది. మేడంతాకూడా దీపాలు వెలిగినాయి, కాని, ఆ గదిలోమాత్రం దీపం లేదు. . ఫాన్‌మాత్రం ఆడు తూంది.

ఎదుట పోర్టికో తలుపు తెరిచిఉన్నది. గోదావరిమీద నుంచి చక్కని గాలి వస్తూన్నది. . ఏటినడుమనుంచి, గాలి

పాటు ఉన్నప్పుడల్లా, అవ్యక్తమధుర ధ్వనిలో పడవవాళ్ళ పాటల చరణాలు, అక్కడక్కడ వినబడుతున్నాయి. రొప్పు కుంటూ, వంతెన నంతా ఊగిస్తూ, పాసింజరు పరుగెత్తింది. చల్లగాలికి గోదావరిఒడ్డుకు వచ్చి కూర్చున్న పిల్లవాళ్ళల్లో ఎవరో, గొంతెత్తి చక్కగా పాడుతున్నాడు. .

"ఓబిలేశుని కొండలనడుమా

వంచెగడ్డి కోసేదానా

వంచెగుడ్డా, వల్లెగుడ్డేమే. .

వినపడుతున్నదికాని, వనలత వినిపించుకోవడం లేదు. ఏదో ఆలోచించుకుంటూ, ఎక్కడో, ఏధోరణిలోనే ఉన్నది.

"గిద్దలగిరీ కొండల నడుమా

ఎద్దులకానే...ముద్దులమరదీ

నన్ను చూసీ నవ్వబోకోయి...హరిఓబిలేశా"

వనం...అప్రయత్నంగా ఆలించింది. జాలిగా విని, నవ్వు కున్నది అహోబిల నారసింహుడుకూడా., ఆడవాళ్ళ కోసం, అంత అవస్థపడుతాడుకదా అని. .

"కట్టమీదనుం చెళ్ళేదానా

కాలుకురచా చిన్నదానా

కమ్మలిస్తా వెంటవస్తావా..."

—వనం చివాలున లేచి నిలుచున్నది. పాడేవాడి మీద, ఆపాటమీద ఫెళ్ళున కోపం వచ్చింది. తలుపు మూసేద్దామనుకుని ముందుకు ఘూకుడుగా వెళ్ళింది. కాని పోర్టికోలో అడుగుపెట్టేటప్పటికి, చల్లగాలికి ప్రాణం లేచివచ్చి, ఆలాగే నిలువబడిపోయింది. ఓ స్తంభాన్ని ఆనుకుని, ఉదయించాలని యత్నిస్తూన్న బాలచంద్రుణ్ణి చూస్తూ.

చూస్తూ—చూస్తూ..ఆచూపే క్రిందకు మరల్చింది. గోదావరిఒడ్డున ఇంకా ఎవరో చాలామంది అక్కడక్కడ కూర్చునే ఉన్నారు. మనుష్యులు కన బడటం లేదు కాని, సిగరెట్ల వెలుగు చూచాయగా గోచరిస్తున్నది.

క్రొత్తబులబాటం కాబోలును, ఎవరో..స్కూలు పిల్లవాడయి ఉంటాడు..టార్చిలైట్ మాటి మాటికి వేస్తున్నాడు. ఆవెలుతురితో, భూమ్యాకాశాలు అలవి అయినంత వరకూ పరీక్షిస్తున్నాడు. ఓమారు వనం చాయలకూడా వచ్చింది వెలుతురు. అప్పుడు చప్పున ప్రక్కకు వొరిగింది ఆఅమ్మాయి.. మళ్ళా చీకటి అయింది.

ప్రక్కగదిలో శాంత ఉన్నది, అలంకరించుకుంటూ గదిలో దీపం ఉన్నది, సన్నని గొంతులో ఏదో పాటకూడా వినిపిస్తూన్నది.

ఒక్కమారే పాట ఆగిపోయింది, దీపం ఆరిపోయింది. ఉన్నట్టుండి మళ్లా వెలిగింది, మళ్లా ఆరిపోయి, మళ్లా. .

వనానికి అప్పటికి అర్థమయింది . . ఒక్కపరుగున లోపలికి వెళ్ళి స్విచ్ వేసింది. . గదంతా వెలుతురయింది

'శాంతా. .'

'అక్కయ్యా !. .'

పైటపిన్ను అమర్చుకుంటూ శాంత తనగదిలోనుంచి బయటికి వచ్చింది. వనలత ఆ అమ్మాయని ఉరిమిచూసి,

'ఏమిటాపని' అని గర్జించింది.

శాంత. . గోహర్ పోజుతో. . అలాగే నవ్వి,

'ఏమిసనా. . పాడుపని. .' అని తన గదిలోకి తిరిగి వెళ్ళిపోతూన్నది.

వనం ముందుకి దూకి, శాంతజడ పట్టుకున్నది. శాంత కలవరపడి, తప్పించుకోవలెనని చూసి, వశముకాక, నిలువబడిపోయింది.

'సిగ్గులేదూ ?. .'

శాంత ఊరుకున్నది,

'మాట్లాడవేం. .'

శాంత ఎకసెక్కెంగా నవ్వి. .

'అవును. .అందరికీ. . కాంతంలాటివాళ్లు దొరకవద్దూ'! అన్నది.

—వనం ఒళ్లు మరచిపోయింది. ఆకోపంలో, చేయి ఎత్తింది.

'చిన్నమ్మాయ్! . .'

వాళ్ళ నాన్నగారు క్రిందనుంచి కేకవేశారు. . శాంత తప్పించుకున్నది.

3

'నీవుకూడా రావూ ?'

భోజనంచేసి మేడమీాదికి వెళ్ళబోతున్నది వనం. కాంతం పైనుంచి ఎదురువచ్చాడు . . తప్పించుకుందామని చూసింది. కాని మాటాడకుండా వీలులేకపోయింది.

' ఊహూ . . ' అని తలఊపింది.

' రావూ . . నీవుకూడా వస్తావని, చాలా . . అనుకుంటున్నాను . . రావూ.'

వనం ఊరుకున్నది. కాంతం, దగ్గరికి వచ్చి . . ఆమె చెక్కిలి నిమురుతూ,

' రావూ . . ' అన్నాడు . .

ఆ అమ్మాయి అతనికి ఎడంగా జరిగి . . చాలాదీనంగా,

' కాంతం? . . నన్ను ఎందుకూ ఈలా హింసిస్తావూ, అన్నది. ఆతడు తెల్లబోయినాడు.

' ఆయన . . నీస్నేహితులుకారూ? చనిపోయినవారు, కాని, నామనసులోనుంచి పోలేదే . . నీమిత్రుడి భార్యను . . అంటుపరచాలని చూస్తావా? అప్పుడు, నేను ఈస్పృహలో లేను . . నీస్నేహితుని . . తలచుకుంటూ . . నీవు . . ఈ పెదవిని . . ఈ . .

ఆ ఆవేశంలో బలంకొద్దీ పెదవిమీద కొట్టుకుంది. . నెత్తురు కమ్మింది.

'చూశావా. . ఇదుగో. .'

పిడికిలితో మళ్లా కొట్టుకున్నది. కాంతం అక్కడ నిలువకుండా క్రిందకు వెళ్లిపోయినాడు. వనం ఆలాగే చాలాసేపు తలవంచుకుని నిలుచున్నది.

'అమ్మాయి, వనం! అక్కడ నిలుచున్నావేం ?

అని వెనుకనుంచి ముసలమ్మ. . మామ్మ. . కేకవేసింది.

'ఏమీలేదు. . పైకి వెళుతున్నాను. .' అని వనం గబ గబ మెట్లు ఎక్కిపోయింది.

గదిలో బల్లమీద . . ఆతని . . ఫోటో ఉన్నది. వనం దాన్ని తీసుకుని, చాలా జాలిగా చూస్తూ,

'నన్ను. .వదిలి పెట్టి వెళ్లారు కాదూ. .నేను . .కూడా వస్తా. .'

అని వెక్కి వెక్కి ఏడువ మొదలుపెట్టింది. .

. .గుమ్మంలో, శాంత నవ్వుతూ నిలుచున్నది . . వనం ఆమెను చూసి, కళ్ళ నీళ్లు ఆపుకుంటూ, అక్కడనుంచి వెళ్ళి పోబోయింది. శాంత దగ్గరకువచ్చి,

'ఏమి తోచదా ఏం నీకు, వనం! . . . ఎప్పుడూ ఓకే శోకాలా? లే. .వేళయింది, నాటకానికి వెళుదాము. .'

వనం కోపంగా. .

'నేను రాను. .'

'ఎందుచేతనో?,

'నాయిష్టం!'

'పోనీ. .నేను పనికి రాకపోతే . ., మీ కొంతం . ,'

వనం ఏమీ మారుపలుకకుండా . . తన వివరింపంతా ఆమెకు అర్థమయ్యేటట్లు శాంతవంక జూచింది,

శాంత, ఆ బాణాన్ని లక్ష్యంచేయకుండా నవ్వి. .వనం చేతినుంచి ఆ చిత్రాన్ని లాక్కుని. .సావకాశంగా చూసి.

"చక్కనివాడేనే. .వనం. .మీ ఆయన. .'

అని ఆ చిత్రాన్ని ముద్దిడుకున్నది.

—'ఇంకా కదలరేమమ్మా! పది కావచ్చింది. .అరగంట నుంచీ కారు వాకిట్లో ఉన్నది. . లేండి . . ఇంకా ఎంతసేపు?,

తాతగారు, ఓపికచేసుకుని మేడమీదికివచ్చి హెచ్చరించారు. శాంత. .

'చూడండి, మరి . . వనం రాదుట !' అన్నది.

వనం కూడా అందుకుని. .

'నేను వెళ్ళనండీ . . పోనిద్దురూ' అని, ఏదో పుస్తకం తీసుకున్నది, బల్లమీదనుంచి.

'అదేమిటమ్మా . . వెళ్ళిరా, బాగుంటుంది . . నీకోసం టిక్కెట్టుకూడా తెప్పిస్తే . .'

'పోనీ ఇంక ఎవరినైనా పంపండి'

‘సరే, మీ యిష్టమమ్మా . .నామాటలు వింటారా’

అని ముసలాయన విసుక్కున్నాడు. ఆయన్ను నొప్పించడ మెందుకని, వనం ఒప్పుకున్నది.

—‘నీవే కూర్చుందువుకానిలే కాంతం ప్రక్క . . బలే . .’

మెట్లుదిగి వస్తూన్నారు . . శాంత వనంతో మెల్లిగా అన్నది . . వనం క్రిందకు చెంగున దూకింది.

‘ఇలా కూర్చో. పోనీ నీయిష్టం . . ముందుకూర్చో’ అన్నాడు కాంతం. వనలత ముందు ఎక్కపోయింది . . శాంత నవ్వి,

‘అవును . . రజాక్ ప్రక్కను . .బలే బాగుంటుందిలే. . కూర్చో . .’అన్నది. వనం మళ్ళా తిరిగి వెనకనే ఎక్కింది. ఆమె వెంట శాంత, తరువాత కాంతం ఎక్కారు.

మూడు గంట లయి ఉంటుంది . .నాటకం చాలా ఆలస్యంగా అయింది.

అంతకుముందు విన్న డ్యాన్సుసాంగు . . వచ్చి రాని ఫణతిలో . . ఈలతో విసురుతూ, డ్రైవరు, కారు వదిలాడు. వనానికి నిద్ర తూలుతున్నది . . ముంద్దుకువాలి నిద్రపోయింది,

ఉలిక్కిపడి లేచింది. .ఇంకా కారు సాగుతునే ఉన్నది. . నిద్రపట్టడంతోనే, అంతలో కలవరపడి మేల్కొంచింది.

అందుకనే . . ఆ అవమానానికే కాబోలును . .

రజాక్, ఆమెమీద చేయివేశాడు . . ఆమె విదిలించుకుని ప్రక్కకు ఓసరిల్లింది.

ప్రక్కను ... శాంత ... కాంతం కౌగిలిలో ఉంది.

౮

ఫోను మోటారు స్టార్టుచేసింది శాంత.

"...జాలముచేసి కలసి...ఏ లీరతనాల జుమి

కీలజత పంపేనన్న...తాలవనలోలా...అల...

నీమాట లేమాయెనురా...సామీ...పల్కరా..."

'ఎప్పుడూ...ఆ పాడు జావళీలేనా...మరేవీ లేవూ...' అన్నది వనం...ఒళ్ళు విరుచుకుంటూ, సోఫాలోనుంచి లేచి. .

.చాలా బాగుంటాయి...ఇది...విను...'

శాంత మళ్ళా ఒక క్రొత్తరికార్డు పెట్టింది...వనం చిడిముడిపాటుతో అక్కడనుంచి లేచింది.

'వనం ! ... ఇవాళే క్రొత్తఫిల్ము ఒకటి తెచ్చాను. తాతయ్యగారు కూడా చూస్తానన్నారు. నీవురావూ, శాంతా నీవుకూడా వస్తావా ...'

అని రమేశం ఎదురువచ్చాడు...

'వీటి తాతలలాటివి చూశాను, దాచుకో, నేనురాను నాయనా! తాతయ్యగారికి చూపించు కావాలంటే...ఆయన మహాఓపిక' అన్నది శాంత...రమేశము చిన్నబుచ్చుకున్నాడు. వనం అతని బుజంమీద చెయివేసుకుని, శాంతవంక తిరిగి అయినా చూడకుండా,హాలులోకి వెళ్ళిపోయింది.

చూసింది కొంచెంసేపు...ఇక చూడలేక పోయింది... ఎక్కడ చూసినా శృంగార లీలలే...

ఇవతలికి వచ్చింది...ఇంకా ఫోను వినబడుతూనే ఉంది. మధ్యమధ్య...ఆ ధోరణిలో కలసీ కలియకుండా శాంత సంగీతమూను...

ఏమీ తోచడం లేదు, ఏదన్నా చదువుకో వచ్చును కదా అని, ప్రక్కగదిలోకి వెళ్ళబోయింది కాని, గుమ్మందాకా పోయి ఆగింది. లోపల, వాళ్ళ నాన్నగారు, కాంతానికి వేదాంతం చెపుతున్నారు...వనం వింటూ నిలుచున్నది...

—చూశావూ... సంస్కారమంటే అదోయ్...కఠవల్లిలో...ఆయముడు...నచికేతుణ్ణి అడుగుతాడు..."యే యే కామా దుర్లభా మర్త్యలోకే సర్వా న్కామాన్ఛందతః ప్రార్థయస్వ.." అని.. "ఇమా రామాః సరథాః సతూర్యా నహీదృశా లంభనీయా మనుష్యైః.."ఈ మాదిరిగానే ఎంత ఊరించినా . . ఆ పిల్లవాడు . . వయసుకు పిల్లవాడే కాని . . మహానుభావుడు, లోణికాడేమో చూశావు . . "వరస్తుమే

వరణీయ స్సవవ . .” అని ఆత్మవిజ్ఞానం కావాలన్నాడోయ్ . వాడా . . ఇప్పటి కాలపు రకాలా . .

“ఇప్పటిరకాలా . . శ్వసతికథ మసౌ రసాలశాఖాం చిరవిరహేన విలోక్య పుష్పితాగ్రాం . . ఈ బాపతేనోయ్ . . అసలు నేను చెప్పవచ్చింది ఏమంటే . . శంకరుడు వీళ్ళ అందరి లోకి నాయకమణోయ్ . . శంకర మతం . . నీకు సులువుగా అరగంటలో చెపుతాను . . ఎంతవాడో నీకే తెలుస్తుంది . . భాష్యంలో . . ప్రచురానంద . .

—“ఇప్పుడే వస్తాను ఉండండి . . అని కాంతం తప్పించుకుని వచ్చేశాడు . .

“ఏమండీ శంకరాచార్యులుగారూ . .” అని పలుకరించింది శాంత, వనం వెనుకనుంచి. ఎప్పుడు వచ్చి అక్కడ నిలుచున్నదో వనంకూడా గమనించనే లేదు . .

కాంతం నవ్వి,

“వెనుకటి శుకుడితపం చెడగొట్టడానికి రంభ వచ్చిందట మరి, శంకరుడి . .”

‘. . . ఈ ఊర్వశి . . .’ అని కనుసైగతో వనాన్ని చూపించింది శాంత. ఆతడు ఆమెవంక సాభిప్రాయంగా చూసి, ఏ కళనున్నాడో, అక్కడనుంచి వెళ్ళిపోయినాడు.

‘వనం...’

అని ఆమె బుజంమీద చేయివేసింది, శాంత.

వనం...‘ఏం’ అని తలఊచి అడిగింది...

‘శాంతం...‘నిన్ను ప్రేమిస్తున్నాడు...ఆతన్ని...’

వనం ఆమెమాటకు అడ్డంవచ్చి...

‘వద్దు...నాతో ఈమాటలుచెప్పద్దు...’అన్నది.

శాంత రుంజుకుంటూ...

‘అబ్బ...ఎంతఇల్లాలివే...’ అన్నది...

వనం ఆడుపులిలాగా చెలరేగి...

‘నేనా ... నన్ను అనడానికి నీకు అభిమానంలేదూ ... నిన్ను...నీవుచేసే పనులను చూస్తే...ఇల్లాలినా... కాను — నామగడు...ఏలోకంలోనో ఉన్నాడు...నీవు...నీవు’

శాంత ముందుకువచ్చి వనం చేయిపట్టుకుని,

‘ఏమన్నావూ...జాగ్రత...’అన్నది...

‘చేయి వదులు’

‘వదలను, ఏంచేస్తావు?’

“వదలవూ!”

‘ఊహు...’

- ఠపీమని కొట్టింది వనం శాంతను. ఆ దెబ్బకు నిలుకడ తప్పి క్రిందకు -- మెట్లమీదుగా దొర్లుకుంటూపోయి ... మేడ

మీాదికి రావాలని మెట్టుమీాద అడుగువేస్తూన్న — తాతగారి మీాద పడ్డది. ఆయన అయ్యో — అయ్యో ... అనుకుంటూ క్రిందపడిపోయినాడు.

వనం గబగబ క్రిందకు వచ్చి—శాంతవంకైనా చూడకుండానే, తాతగారిని లేవదీసి, ఆయనకు సాయమై లోపలకి తీసుకునిపోయింది.

౨౩

— ఎత్తినతల వంచకుండా, పైన తిరుగుతూన్న విమానాలని చూస్తూ నిలుచున్నది వనం పైమేడమీాద. .

కొంచెంసేపు తిరిగి . . చివరకు కనబడకుండా పోయినాయి... 'స్వర్గంలోకి వెళ్ళే విమానాలు . .ఎలా ఉంటాయో.'

...ఏమేమో తలపోసికుంటూ కన్నీరు పెట్టుకున్నది వనం.

'చూడు...చూడు, అక్కయ్యా!

ప్రభావతి వనాన్ని హెచ్చరించింది ... వనం ఆకాశం వైపు చూసింది...

'అక్కడ కాదు...క్రింద...తోటలో...అదిగో నీలాంబరాలదగ్గర...

వనం చూసింది...చూసి తలతిప్పుకున్నది.. మామూలే శాంతా...మరి...ఓ...

‘శాంతా... ఇదిగో... ఇక్కడ...’

పిట్టగోడమీదుగా వంగి ప్రభావతి పిలవడం మొదలు పెట్టింది చేయివిసురుతూ. వనం వద్దని వారించింది, కాని అల్లరి పిల్ల, ఆమెను వినిపించుకోడం లేదు..

ఎంతో వయ్యారంతో, కులుకుతూ, శాంత వచ్చింది అక్కడికి.

‘ఏం... ద్రౌపదిని మించిపోతున్నావ్ ?’ అన్నది వనం. శాంత నవ్వి, ఆ మాట మార్చేసి, తలలో పూలదండ సరి చేయమని దగ్గరకు వచ్చింది.

—ఇద్దరూ క్రిందికి దిగి వచ్చారు...

హాలులో తాతగారు పేపరు చదువుకుంటూ కూర్చు న్నారు...

‘ఎక్కడికమ్మా !..’ అన్నా డాయన ఇద్దరిని చూసి..

“షికార్ వెళ్ళివస్తామండీ..” అని శాంత జవాబుచెప్పి, వనం అడ్డుచెప్పకముందే ఆమెను లాక్కొనిపోయి కారు ఎక్కిం చింది.

"త్వరగా పోనీయవోయ్" అన్నది శాంత రిస్టు వాచి చూసి. .

"ఇంకా ఎంతత్వరగా. . అక్కడేమీ మించి పోవడం లేదు. ." అని రజాక్ మాట వెన్నుమీదుగా విసిరాడు.

"ఏమిటోయ్. . ఒళ్ళు దగ్గరపెట్టుకుని మాటాడు." అని వనం అందుకున్నది. .

"పోనీలే. . ఫరవాలేదు. ."అని శాంత సర్ది చెప్పబోయింది.

కారు గోదావరి ఒడ్డున ఆగింది. ఇద్దరూ దిగి నడుస్తున్నారు. ముందుకు పోయి కూర్చుందామని. .

"రజాక్ దగ్గరనుంచీకూడా. . నీవంటే అంత అలుసేనా" అని మందలించింది వనం ..

"వాడి మొగం. . ఏమీ తెలియదు. ‹అమాయకుడు"

"మన నౌకరు. ."

"పోనీలెద్దూ. ."

ఒకచోట కూర్చున్నారు. సన్న పట్టుచీరమీది నులిముడతలులాగా గోధావరిమీద, తెల అలలు పాటకరిస్తున్నాయి.

వనం గోదావరివైపు చూస్తూ, పడుకునిఉన్నది. శాంత, ఆదుర్దాతో దిక్కులు చూస్తున్నది.

"ఇప్పుడే వస్తాను ఉండు" అని శాంత లేచినిలుచున్నది. .

"ఎక్కడికి"

"ఎక్కడికీ లేదు. . ఇప్పుడే వస్తానుకాదూ. ."

ముందుకు సాగిపోయి. . తిన్నెలు చాటవడంచేత కనబడకుండా పోయింది శాంత. . వనం ఆవైపైనా చూడలేదు. .

క్రమంగా చీకటి ముసుకువస్తున్నది. ఎవరో వెనుకనుంచి. . వనంకళ్లు మూశారు. ఆ అమ్మాయి కలవరపడి లేచి కూర్చుని, బలవంతాన ఆ చేతులు తీసివేసింది .

కాంతం. . నవ్వుతూ నిలుచుని ఉన్నాడు. .

"కాంతం !. . నీకు జాలిలేదూ. ." అన్నది వనం. ఆతడు ఊరుకున్నాడు. .

"దయయుంచి ...నన్ను బ్రతుకనీయవూ..."

"దయయుంచి ... నన్నూ బ్రతుకనీయవూ ... వనం! నిన్ను విడిచి బ్రతుకలేకుండా ఉన్నాను..."

కాంతం మరీదగ్గరకు వస్తున్నాడు...

"వద్దు...ముందుకు రావద్దు" ...అని తాను వెనుకకు నడిచింది...వనం.

"ఉహు ..నీవు నాకు కావాలి..వనం. ."

కాంతం ముందుకు వస్తున్నాడు. .వనం చకచకా వెనుకకు అడుగులు వేస్తూన్నది.

"ఊరుకోవూ. .కాంతం!. ."

కాంతం వినిపించుకోలేదు. .వనం. ఆగకుండా వెనుకకు అలాగే నడచిపోయి. .

గోదావరి మామూలుగానే ప్రవహిస్తూంది. .ఆ పిల్లను తనలో చేర్చుకోడానికి. .రవంత ఎడమైంది. .మరల కలుసుకుని కమ్ముకుపోయింది. .

కాంతం అక్కడనే కూలబడిపోయినాడు. .

చాలా చీకటిపడ్డది. రజాక్ హారన్ వేస్తూన్నాడు. . శాంత నవ్వు చూచాయగా వినిపిస్తున్నది. .